క్లుప్తంగా

పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లు అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లను ఆదివారం ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ బాధితులకు అప్పగించారు. ఈజ్‌గాంకు చెందిన ఉత్తమ్ సర్కార్, కాగజ్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్‌లు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీం పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణ మహోత్సవం

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో ఈ నెల 17న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు భట్టమేకల గట్టయ్య ఆదివారం తెలిపారు. శ్రీరామ నవమి పురస్కరించుకొని బుధవారం కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పెద్దవాగు వంతెన పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి పెద్దవాగు వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆదేశించారు. ఆదివారం ఆయన అందవెల్లి వద్ద గల పెద్దవాగు వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. వర్షాకాలంలోపు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



ఎన్నికల ప్రచారం చేస్తున్న రావి శ్రీనివాస్

కౌటాల: కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలోని పేదలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదన్నారు. బీజేపీ హయాంలో దేశ అభివృద్ధి కుంటుపడిందన్నారు. మండల నాయకులు బండి శైలజాగౌడ్, దేవన్న, సంతోష్, ప్రభాకర్‌గౌడ్, శ్రీరాములు, కాశీనాథ్, సంజీవ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండలంలోని గంగాపూర్, పాశిగాం, తుంగెడ, లక్ష్మీపూర్, మాద్వాయిగూడ గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి'



రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: ఇందిరానగర్ వద్ద జాతీయ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో నివారణకు నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. ప్రమాదాలు జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఇటీవల ఇందిరానగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఇందిరానగర్‌లోని జాతీయ రహదారిపై కొన్ని రోజుల క్రితం వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గ్రామానికి చెందిన వడ్లూరి గణపతి, దుర్గం చిన్నయ్యలు మృత్యువాత పడగా ఆదివారం ఎమ్మెల్యే బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు ఆనంద్, వినోద్‌జైస్వాల్, తిరుపతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో ర్యాలీ



కాగజ్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విఠల్, కోనప్ప



వాంకిడి: ఖమాన గ్రామంలో పంచశీల జెండా ఆవిష్కరణ



రెబ్బెన: పూలమాల వేస్తున్న ఏరియా జీఎం రవిప్రసాద్

అంబేద్కర్‌కు ఘన నివాళి



కాగజ్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, కొత్తపల్లి శ్రీనివాస్

జిల్లాలో అంబేద్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాకేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘ నాయకులు, ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం విశ్వనాథ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పంచశీల జెండా ఆవిష్కరించారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

దేశం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

ప్రపంచమేధావి..

ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మాజీ కౌన్సిలర్ విశ్వేశ్వర్, నాయకులు జాడి దీపక్, శ్రీనివాస్, తిరుపతి, ప్రశాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని లుంబిని దీక్షభూమిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జీఎం కార్యాలయంలో..

గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బీఆర్ అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఉన్న విగ్రహానికి కార్మిక సంఘాల నాయకులతో కలిసి జనరల్ మేనేజర్ రవి ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.



దహెగాం: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో



ఆసిఫాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



లింగాపూర్: పూలమాల వేస్తున్న గ్రామస్తులు



ఆసిఫాబాద్: ఆర్టీసీ డిపో ఆవరణలో..



సిర్పూర్(టి): నివాళులర్పిస్తున్న ఎంపీడీవో



వాంకిడి: శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు



కౌటాల: ఎంఈవో కార్యాలయంలో..



బెజ్జూర్: పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆసిఫాబాద్: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..



దహెగాం: ప్రెస్‌క్లబ్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థినులు



కెరమెరి: ఎంపీడీవో కార్యాలయంలో..



కాగజ్‌నగర్‌రూరల్: దీక్షాభూమిలో నివాళులర్పిస్తున్న డీఈవో



రెబ్బెన: నివాళులర్పిస్తున్న నాయకులు

జార్జిరెడ్డి పోరాటం స్ఫూర్తిదాయకం

తిర్యాణి: విద్యార్థి ఉద్యమ నాయకుడు జార్జిరెడ్డి పోరాటం స్ఫూర్తిదాయకమని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలల్లో పొందుపర్చాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాడి విలాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా సుంగాపూర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల కార్యదర్శి జగజంపుల తరుణ్, పల్లవి, కావేరి, కార్తీక్, సాయి ఉన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జీనా హైతో మర్నా సీకో కదం కదం పర్ లఢ్నా సీకో అంటూ నినదించిన విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి అని పీడీఎస్‌యూ సహాయ కార్యదర్శి రత్నం రోజా కొనియాడారు.



నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

జార్జిరెడ్డి 52వ వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ బీసీ బాలికల వసతి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశ్విని, ప్రజ్ఞా రాణి, నైనా తదితరులు పాల్గొన్నారు.

భక్త మార్కండేయ ఆలయకమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు నదీతీరంలో గల శ్రీ భక్త మార్కండేయ ఆలయ కమిటీని ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా జంజిరాల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించి, అందరి సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులపై 'వాత్సల్యం'

- 114 మంది అర్హుల ఎంపిక
- ఖాతాల్లో ప్రతినెలా రూ.4వేలు నగదు జమ
- క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న అధికారులు



ఎల్కపల్లిలో లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న అధికారి

పెంచికల్‌పేట్: కరోనా లేదా ఇతర కారణాలతో తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పద్దెనిమిది సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలకు ప్రతినెలా ఆర్థిక సహాయం అందించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకానికి శ్రీకారం చుట్టాయి. విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా వారికి ఆర్థికంగా భరోసా కల్పించడానికి ప్రారంభించిన పథకం ద్వారా ప్రతీనెల అర్హులైన 18 ఏళ్లలోపు బాలబాలికలకు ప్రతీనెలా బ్యాంకు ఖాతాల్లో రూ.4వేలు చొప్పున 9నెలల కాలానికి రూ.36వేలు నగదు జమ చేస్తుంది. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్(టి) ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అర్హులైన విద్యార్థులకు నగదు జమ చేస్తున్నారు.

114 మంది అర్హులు..

జిల్లాలోని రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు రాగా మొత్తం 114 మంది అర్హులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డీసీపీవో కార్యాలయం ద్వారా అధికారులు అర్హులైన వారి ఇళ్లను సందర్శిస్తూ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. పథకానికి ఎంపికైన వారి స్టడీ సర్టిఫికెట్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల వివరాలు, చదువు సాగిస్తున్న పాఠశాల వివరాలు క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నారు. ప్రభుత్వం బాలబాలికలకు అందిస్తున్న ఆర్థిక సహాయం అర్హులకు చేరేలా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు.

ఆర్థిక భరోసా..

మిషన్ వాత్సల్య పథకం ద్వారా తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలబాలికలు ఆర్థికంగా భరోసా పొందుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో ఒక వైపు చదువులను కొనసాగిస్తూ మరోవైపు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆర్థిక సహాయంతో భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవడానికి మార్గం సుగమం అయ్యింది.


క్షేత్రస్థాయిలో పరిశీలన



జిల్లాలో 114 మంది అర్హులు ఉన్నట్లు అధికారులు జాబితా రూపొందించారు. అర్హుల ఇళ్లలోకి వెళ్లి వారు ఆన్‌లైన్‌లో అందించిన పత్రాలను సరిచూస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే వారి ఖాతాల్లో 9నెలల ఆర్థిక సహాయం రూ. 36వేలు జమ చేశాం.

– శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్, డీసీపీవో కార్యాలయం

ఆకులు రాలి.. మోడుగా మారి



పాటగూడ వద్ద..

కెరమెరి: జిల్లాలో మొన్నటి వరకు దట్టంగా ఉన్న అడవులు ప్రస్తుతం పలుచగా మారాయి. అడవిలోని చెట్ల ఆకులు రాలిపోయి అందవిహీనంగా కన్పిస్తున్నాయి. దట్టమైన చెట్లతో కనిపించే అడవులు.. బండరాళ్లతో దర్శనమిస్తున్నాయి. మండలంలోని పాటాగూడ, చాల్‌బాడి, జోడేఘాట్, బాబేఝరి, పెద్ద పాట్నాపూర్, శివగూడకు వెళ్లే దారిలోని అరణ్యాలు చెట్ల ఆకులు రాలిపోయి మోడువారాయి.



శివగూడ సమీపంలో మోడువారిన అడవి



జోడేఘాట్‌కు వెళ్లే రోడ్డుకిరువైపులా..

'మాడుగుల'కు సన్మానం



ఆసిఫాబాద్‌అర్బన్: పద్య సరస్వతి పీఠం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన శతకవి సమ్మేళనానికి జిల్లా కేంద్రానికి చెందిన అవధాని మాడుగుల నారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి దంపతులను జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీఠం అధ్యక్షుడు భానుప్రకాశ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ శర్మ, ఆచార్య గౌరీశంకర్, ఈవీఎల్ నర్సింహారావు పాల్గొన్నారు.